క్లుప్తంగా

ప్రతీ పేదవాడికి ఇల్లు నిర్మిస్తాం



ప్రొసీడింగ్స్ అందించిన మంత్రి అడ్లూరి

వెల్గటూర్: రాష్ట్రంలోని ప్రతీ పేదవాడి సొంతింటి కలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు.ఈ మేరకు ఎండపెల్లి మండలంలోని ముంజంపెల్లి,మారేడుపల్లి గ్రామాలలో అర్హులైన 29 మంది లబ్ధిదారులకు నిర్మాణ అనుమతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు,కార్యకర్తలు,అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

గొల్లపల్లి: దేవి నవరాత్రుల్లో భాగంగా గొల్లపల్లి మండల కేంద్రంలోని రామాలయంలో దుర్గామాతను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రిని సన్మానించారు.

కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వరప్రసాద్

ఇబ్రహీంపట్నం: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని వసతులు ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండల సీఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి కోత దశలోకి రానున్నాయని రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పోసేందుకు స్థలాలను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ ప్రసాద్, సీఈవోలు మంత్రి సతీశ్ కుమార్, మహేందర్, సంపత్, ఎస్‌పీవో సీఈవో శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పూర్తికి అధికారులు సహకరించాలి

సారంగాపూర్: బీర్‌పూర్ సబ్‌స్టేషన్ నుంచి నర్సింహులపల్లె మీదుగా చెర్లపల్లికి ఏర్పాటు చేస్తున్న కొత్త విద్యుత్ లైన్ పూర్తికి అధికారులు సహకరించాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం చెర్లపల్లి గ్రామ రైతులు జీవన్‌రెడ్డిని కలిసి విద్యుత్ లైన్ విషయంలో అటవీశాఖ అభ్యంతరంపై ఆయనకు తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన జిల్లా అటవీశాఖాధికారితో పాటు, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈతో మాట్లాడి ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంట, అటవీశాఖ పరిధిలోకి వెళ్లకుండా నిర్మాణం జరిగేలా చూడాలని, లైన్ పూర్తి అయితేనే రైతుల ఇబ్బందులు తొలగుతాయని సూచించారు . కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్‌లు గుగ్లావత్ గోపి, ముక్కెర అశోక్, లింగంపల్లి గంగాధర్, రైతులు ఉన్నారు.

బతుకమ్మ, దసరాకు ఏర్పాట్లు చేయాలని వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయికల్: గ్రామాల్లో హిందువులు ఎంతో పవిత్రంగా జరుపుకునే దసరా, బతుకమ్మ పండగలకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని బీజేపీ మండల నాయకులు బుధవారం ఎంపీడీవో చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఆకుల మహేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో పారిశుధ్యం, వీధిలైట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపించి బతుకమ్మ సమయంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బండారి సాయిరాజ్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి, ఉపాధ్యక్షుడు రవీందర్, సంకోజు మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

పూజ సామగ్రి విక్రయాలకు వేలం

మెట్‌పల్లి రూరల్: జిల్లా సరిహద్దు శివారులోని మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయంలో పూజ సామగ్రి విక్రయాల కోసం నేడు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో విక్రమ్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందస్తుగా రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.



పూల సంబురం బతుకమ్మ



బతుకమ్మ అంటే పూల సంబురం. పొద్దుపొద్దునే లేచి అనేక రకాల పూలు సేకరించి, అందమైన బతుకమ్మను పేర్చి సాయంత్రం ఎప్పుడవుతుందా ఎదురు చూసి అందరితో కలిసి ఆడిపాడే పూల సంబురం బతుకమ్మ పండుగ. ఈ పండగంటే మాకెంతో ఇష్టం.

– వర్షిణి, విద్యార్థిని, జగిత్యాల

శాస్త్రీయత, సంప్రదాయాల మేళవింపు



బతుకమ్మ అంటే శాస్త్రీయత, సంప్రదాయాల కలబోత అన్న పెద్దల మాట వాస్తవం. బతుకమ్మ సందర్భంగా 9రోజుల పాటు అమ్మవారికి సమర్పించి, మనము ఆరగించే ప్రసాదం మన ఆరోగ్యాన్ని కాపాడే ఔషదంగా పనిచేస్తుంది. అందుకే బతుకమ్మ మన జీవితంలో భాగమైంది.

– శివాని, ఉపాధ్యాయురాలు

ఆధ్యాత్మికత, ఆనందం బతుకమ్మ



ఆట, పాటలతో తొమ్మిది రోజుల పాటు సాగే బతుకమ్మ వేడుకల్లో ఆనందం, ఆరోగ్యం, ఆధ్యాత్మికత కలగలిసి ఉంటాయి. నిత్యం పనిపాటలతో ఉండే మహిళలకు బతుకమ్మ ఆటవిడుపుతో పాటు ఆరోగ్యాన్నిస్తుంది. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా మహిళందరూ కలిసి ఆడుకునే సంబరం బతుకమ్మ.

– నీలిమ, గృహిణి, జగిత్యాల

బాలాత్రిపుర సుందరి దేవీగా అమ్మవారు

జగిత్యాల రూరల్ /జగిత్యాల టౌన్/రాయికల్/మెట్‌పల్లి/ ధర్మపురి/మల్యాల/కథలాపూర్/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/గొల్లపల్లి: దుర్గాదేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతిష్ఠించిన దుర్గామాత మండపాల్లో బుధవారం వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కొన్నిచోట్ల బాలా త్రిపుర సుందరిగా, అన్నపూర్ణ దేవిగా, మరి కొన్న చోట్ల శాఖాంబరిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండపాల్లో మహిళలు కుంకుమ పూజలు చేసి, పలు రకాల నైవేద్యాలు సమర్పించారు.





మెట్‌పల్లిలో పుష్పార్చన చేస్తున్న భక్తులు



భూషణరావుపేటలో మహిళల కుంకుమ పూజ





ముత్యంపేటలో మహిళల కుంకుమ పూజ



వేములకుర్తిలో పూజలు చేస్తున్న భక్తులు

మహిళల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

జగిత్యాల: స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మాత శిశు సంక్షేమ కేంద్రంలో ఒమేగా సుశృత హాస్పిటల్స్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్, ఆపి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా క్యాన్సర్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోగం వచ్చాక చికిత్స కన్నా రాకముందు ముందస్తు పరీక్షలు చేసుకోవడం ఎంతో ఉత్తమమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, సుశృత ఒమెగా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రణదీప్‌రెడ్డి, దీప్తి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: ఆరోగ్యాన్ని పరిరక్షించుకునే విషయంలో నిర్లక్ష్యం చూపవద్దని కమిషనర్ మోహన్ పేర్కొన్నారు. పట్టణంలోని అర్బన్ హెల్ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన స్వస్థ్ నారీ శశక్త్ అభయాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని, ప్రతి ఒక్కరు వీటి పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ వైద్యాధికారి వాణి, మున్సిపల్ ఆర్ఐ అక్షయ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు, మెప్మా టీఎంసీ సోమిడి శివ, ముజీబ్ తదితరులున్నారు.



పోషకాహారంపై వివరిస్తున్న వైద్య సిబ్బంది

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత

కథలాపూర్: మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, అందుకే ప్రత్యేక వైద్యనిపుణులతో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు సీనియర్ వైద్యాధికారులు శ్రీనివాస్, అనూష అన్నారు. స్వస్థ్ నారి- స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గైనకాలజిస్ట్, సర్జన్, ఆయుర్వేద విభాగాల ప్రత్యేక వైద్య నిపుణులతో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 120 మందిని పరీక్షించి అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సింధూజ, రజిత, సీహెచ్‌వోలు వేణు గోపాల్, సుగుణ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజంలో భాగం కావాలి

జగిత్యాల: విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానమే కాకుండా సమాజంలో భాగం కావాలని నలంద కళాశాల చైర్మన్ నరేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవం పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సామాజిక పరిస్థితులు అర్థం చేసుకుని సేవ రంగంలో ముందుండాలన్నారు. అనంతరం వాల్మీకి ఆవాసంలోని పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సురేశ్, జగదీశ్వర్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి దేశభక్తి కలిగి ఉండాలి

జగిత్యాల: ప్రతీ విద్యార్థి దేశభక్తితో పాటు సేవా భావం కలిగి ఉండాలని ఆర్‌కే సంస్థల చైర్మన్ రామకృష్ణ అన్నారు. బుధవారం కళాశాలలో జాతీయ సేవ పథకం ఆవిర్భావం పురస్కరించుకుని సమాజంలో యువత పాత్ర అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ నరేశ్, రాజేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ నరేశ్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కే వేణు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు, సామాజిక సేవా భావమును అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బండ్ల భాస్కర్, అధ్యాపకులు, వలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం పంచాయతీ కార్యదర్శి నిలదీత

జగిత్యాలరూరల్: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని ఓ కాలనీలో నెల రోజులుగా మంచినీటి సరఫరా జరగడం లేదు. దీంతో పంచాయతీ వాటర్ ట్యాంకర్‌తో కొద్దిరోజులు నీటి సరఫరా చేశారు. తర్వాత ట్యాంకర్ ద్వారా నీరు రాక, నీటి సరఫరాకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలనీవాసులకు నీరు రావడంతో లేదు. చాలా దూరం నుంచి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారు. దీంతో నీటి సరఫరా కొనసాగించాలని పంచాయతీ కార్యదర్శి వద్దకు వెళ్లగా నల్ల బకాయి, ఇంటి పన్ను కడితేనే నీటి సరఫరా చేస్తామని చెప్పడంతో కాలనీవాసులు బుధవారం పంచాయతీ కార్యదర్శిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ జీపీ వద్ద నిరసన వ్యక్తం చేశారు.



కార్యదర్శిని నిలదీస్తున్న కాలనీవాసులు

రాజరాజేశ్వర నాగాలయ చైర్మన్‌గా దానవేని రాములు

రాయికల్: మండలంలోని కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయ చైర్మన్‌గా దానవేని రాములు, సభ్యులుగా ఎన్నమనేని సత్తయ్య, పాలెపు వెంకటి, దశమందం లచ్చన్న, మంత్రి గోపాలకృష్ణ, ముక్కెర లక్ష్మీ, పోతవేని సత్యనారాయణలను నియమిస్తూ కమిషనర్ శైలజ రామయ్యార్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వీరిని అభినందించారు.

వృద్ధుడి అదృశ్యం

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన నేతికుంట రాజారెడ్డి(58) అనే వృద్ధుడు అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. రాజారెడ్డి ఈ నెల 22న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదన్నారు. బంధువుల ఇళ్లలో వెతికినా చేసిన సమాచారం లేదన్నారు. ఈ మేరకు రాజారెడ్డి కుమారుడు రాజేందర్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలన

మేడిపల్లి: ఇల్లు లేని ప్రతీ పేద కుటుంబానికి ఇల్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం పరిశీలించి మాట్లాడారు. పదేళ్లుగా ఇళ్ల కోసం ఎదురుచూసిన ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లతో కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు ముస్కెం గంగాదర్, పంచాయతీ కార్యదర్శి ఎండీ ఇసాక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మీటర్లు మంజూరు చేయాలి

రాయికల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ట్రాన్స్‌కో అధికారులను కోరారు. బుధవారం పట్టణంలోని ఇందిరమ్మ లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యుత్ మీటర్ల కోసం దరఖాస్తు చేసుకున్నామని, త్వరగా మంజూరు చేయించాలని కోరగా స్పందించిన జీవన్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా మంజూరు చేయాలని విద్యుత్ శాఖ అధికారి సుదర్శన్‌ను కోరారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, నాయకులు కొయ్యడి మహిపాల్ రెడ్డి, షాకీర్, బాపురపు నర్సయ్య, బత్తిని భూమయ్య, తదితరురు ఉన్నారు.

కార్మికులకు వేతనాలు అందించాలి

గొల్లపల్లి: గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు జనవరి నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయని, వెంటనే వేతనాలు అందించాలని కార్మికులు కోరారు. గొల్లపల్లిలో వారు మాట్లాడుతూ పండుగ పూట బస్సులు ఉండే కాలం వచ్చిందని, జీతాలు వెంటనే ఇవ్వాలి జీవో 51 రద్దుచేసి కేటగిర్లవారీగా చేయాలని కోరారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించి అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగిలి ఎల్లయ్య, చెవులమది రాజయ్య, గంగాధర పోచవ్వ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని వినతి

రాయికల్: పట్టణంలోని మూడో వార్డు శివాజీనగర్‌లో సీసీరోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం కాలనీకి చెందిన ప్రజలు మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బొమ్మకంటి మానస, రమ, జ్యోతి, లత, గంగవ్వ, జయసుధ, గుట్ట రమ, తిగుళ్ల లక్ష్మి పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత

రాయికల్: మండలంలోని కిష్టంపేటలో పద్మశాలీ సంఘం భవనానికి ఎంపీ ధర్మపురి అర్వింద్ నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరైనట్లు బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల మహేశ్ తెలిపారు. బుధవారం ప్రొసీడింగ్ కాపీని బుధవారం సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ముత్యంరెడ్డి, నాయకులు సాయిరాజ్‌గౌడ్, ఆడెపు సురేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ చైతన్య యాత్రకు స్వాగతం

మేడిపల్లి: విశ్వకర్మల సాంస్కృతిక, సామాజిక, సాధికారతకు, రాజకీయ చైతన్యం, ఆర్థిక స్వావలంబనను పెంపొందించాలనే లక్ష్యంతో, ఆదిలాబాద్ నుంచి అసెంబ్లీ వరకు చేస్తున్న 1500 కిలోమీటర్ల విశ్వబ్రాహ్మణ చైతన్య పాదయాత్ర బుధవారం మేడిపల్లి మండలానికి చేరుకుంది. శ్రీ విశ్వనాథుల పుష్పగిరికి మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో యాత్రకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పాలాస జనార్దన్, ఉపాధ్యక్షులు గుండోజి కరుణాకర్, అఖిల భారతీయ విశ్వ పరిషత్ మండల అధ్యక్షులు ప్రవీణ్,కుమార్ పాల్గొన్నారు.

సమావేశానికి రావాలని ఆహ్వానం

సారంగాపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 26న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశామని, తప్పకుండా హాజరు కావాలని బుధవారం అధ్యాపకులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను ఆహ్వానించారు. ఆహ్వన పత్రికలను అందించి ఆహ్వానించడంపై కళాశాల ప్రిన్సిపల్ రమేశ్‌బాబును, అధ్యాపకులను విద్యార్థుల తల్లితండ్రులు అభినందిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలలో 26న టీచర్స్, పేరెంట్స్ సమావేశం

మల్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 26న టీచర్స్, పేరెంట్స్ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సూచనలు, సలహాలు స్వీకరించి, తదనుగుణంగా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. తప్పకుండా హాజరు కావాలని కోరారు.

బతుకమ్మ సంబరాలు



మల్లాపూర్: పీహెచ్‌సీ లో బతుకమ్మ ఆడుతున్న వైద్యులు, సిబ్బంది



కథలాపూర్ పీహెచ్‌సీలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో ఫ్రెండ్స్ కిట్టీ పార్టీ మహిళలు

జగిత్యాలటౌన్: బతుకమ్మ సంబరాల్లో భాగంగా బుధవారం విద్యానగర్ ఫ్రెండ్స్ కిట్టీ పార్టీ మహిళలు, చిన్నారుల బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా సాగాయి. కిట్టి పార్టీ సభ్యులు బతుకమ్మ ఆటపాటలతో హోరెత్తించారు. ఫ్రెండ్స్ కిట్టీ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆట పాటలతో విద్యార్థులు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బండి సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో...

కథలాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు, వైద్యసిబ్బంది బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది కలిసి రంగు రంగుల పువ్వులతో బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మ ఆట, పాటలతో సందడి చేశారు.



ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ వెళ్లే దారిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లే చౌరస్తా వద్ద హైమాస్ట్ లైట్లకు సంబంధించిన స్విచ్ బోర్డు కిందికి వేలాడుతోంది. ఏదైనా ప్రమాదం జరగకముందే గ్రామపంచాయతీ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి,ఇబ్రహీంపట్నం, సెల్ నంబర్: 7989715216

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కుమ్మరిపల్లి యువకుడికి చోటు

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లికి చెందిన సైనిక గ్రూప్ జిల్లా ఇన్‌చార్జి పంచతి బాలరాజు చేస్తున్న సామాజిక సేవలకు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పిస్తూ ప్రశంసా పత్రం, మెడల్ అందించారు. ఆయన సేవలను గుర్తించి తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించారు. ఈ సందర్భంగా బాలరాజును యువజన సంఘ సభ్యులు, సైనిక గ్రూపు సభ్యులు అభినందించారు.

మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలి

కథలాపూర్: మొక్కలను నాటడం ప్రజలు బాధ్యతగా భావించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కథలాపూర్ మండలం చింతకుంటలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, బీజేవైఎం మండలాధ్యక్షుడు ఆరె శివ, నాయకులు పాల్గొన్నారు.

దుర్గామాత సేవలో ముస్లింలు

బుగ్గారం: మండల కేంద్రంలో కొలువుతీరిన దుర్గామాత సేవలో ముస్లిం భక్తులు పాల్గొని మతసామరస్యాన్ని చాటారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ అక్బర్,మండల మైనార్టీ నాయకులు అబ్దుల్ రహమాన్ బుధవారం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలు అందించి,శేషవస్త్రాలు అందించారు. కార్యక్రమంలో నగునూరి నర్సాగౌడ్, అకుల శేఖర్, సాన తిరుపతి, జంగ శ్రీనివాస్, కప్పల మల్లేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

సారంగాపూర్: మండల కేంద్రానికి చెందిన మట్ట మహేందర్‌రెడ్డి అనే యువకుడు బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలివిధంగా ఉన్నాయి. తన ద్విచక్రవాహనంపై సారంగాపూర్ నుంచి జగిత్యాల వెళ్తుండగా, తిప్పన్నపేట గ్రామ శివారుల్లో కుక్క అడ్డుగా రావడంతో వాహనం అదుపు తప్పి మహేందర్ కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సామగ్రి ధ్వంసంపై కేసు నమోదు

మల్యాల: మండల కేంద్రాలోనికి చెందిన రిజ్వాన్ ఓ సైబర్ క్రైం వార్తను తప్పుడుగా ప్రచారం చేశారంటూ ఒకరు ఆఫీసుపై దాడి చేసిన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఓ సైబర్ క్రైం కథనానికి సంబంధించి తప్పుడు ప్రచారం చేయడంతో సంబంధిత కేసులో తన స్నేహితులు ఇద్దరు అరెస్టు అయ్యారని, వారి స్నేహితుడు అయిన అనిల్ ఆఫీస్‌లోకి ప్రవేశించి సామగ్రి ధ్వంసం చేశాడు. రిజ్వాన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.